సాక్షి
ఏలూరు
ఆదివారం : 31 : ఆగస్టు : 2025



ఉచిత బస్సు.. ప్రయాణం తుస్సు

మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నామని గొప్పలు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, పలు బస్సు సర్వీసులను రద్దు చేసి ఇక్కట్లకు గురిచేస్తోంది. 8లో ▸



బోసిపోయిన ఉల్లి మార్కెట్

ఉల్లి లారీలతో కళకళలాడే తాడేపల్లిగూడెం మార్కెట్ బోసిపోయింది. లారీలు రాకపోవడంతో మార్కెట్‌లో ఏ వీధి చూసినా హమాలీల సందడి లేదు. 8లో ▸




మొక్కు తీర్చుకునేందుకు వెళుతూ..

శ్రీవారికి మొక్కు తీర్చుకునేందుకు వెళుతున్న దంపతులను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొంది. ప్రమాదంలో భర్త దుర్మరణం చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. 8లో ▸

బార్లకు నో టెండర్స్

- సర్కారుపై సిండికేట్ ఒత్తిడి
- టెండర్లు వేయకుండా పొలిటికల్ రింగ్
- ఏలూరు జిల్లాలో 10 బార్లకే టెండర్లు
- ఏలూరు నగరంలో 12కి 4 బార్లకు మాత్రమే టెండర్లు

మద్యం షాపుల కేటాయింపులో సిండికేట్లుగా మారి కూటమి నేతలు దోచుకోగా.. ఇప్పుడు బార్ల టెండర్లలోనూ సిండికేట్లు షాకిచ్చారు. దీంతో ఏలూరు జిల్లాలో 10 బార్లకు టెండర్లకు వేయనివ్వకుండా రింగ్ అయ్యారు. చివరకు 10 బార్లకే లాటరీ తీశారు.



సాక్షి ప్రతినిధి, ఏలూరు: కూటమి సర్కారు నూతన బార్ పాలసీ బెడిసికొట్టింది. భారీగా టెండర్లు వేస్తారనీ... సర్కారుకు భారీగా ఆదాయం వస్తుందనే ఆశలు ఫలించలేదు. పైగా కూటమి పార్టీల్లోని నేతలు, మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి టెండర్లు వేయకుండా ఒత్తిడి పెంచుతూ డిపాజిట్లు తగ్గించేలా కొత్త డ్రామాకు తెరతీశారు. లైసెన్సు ఫీజులు తగ్గించామని, బార్ల టైమింగ్స్ సైతం పెంచటంతో భారీ ఎత్తున టెండర్లు వస్తాయని అంచనా వేయగా... పూర్తిగా మద్యం సిండికేట్లు వ్యూహంలో భాగంగానే టెండర్లు వేయకుండా గేమ్ ప్లాన్ చేశారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఏలూరు జిల్లాలో ఓపెన్, కల్లు గీత కులాలకు సంబంధించి 20 బార్లకు నోటిఫికేషన్ జారీచేయగా.. శనివారం కలెక్టర్ వెట్రిసెల్వి లాటరీ విధానంలో బార్ల లైసెన్సులకు అనుమతులు ఇస్తూ ఎంపిక చేశారు. 10 బార్లకు టెండర్లు వేయకుండా ఊహించని రీతిలో మద్యం సిండికేట్లు అధికారులకు షాకిచ్చారు.

సిండికేట్ల స్కెచ్ : నిర్ణీత గడువులోగా టెండర్లు వేయకుండా అడ్డుకుంటే... ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుందనీ, ఎవరూ ముందుకు రాకుండా ఉంటే.. చివరికి ప్రభుత్వమే దిగివచ్చి తక్కువ డిపాజిట్లు, లైసెన్సు ఫీజులతో బార్లకు అనుమతులు ఇస్తుందనే స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రైవేటు మద్యం దుకాణాలను సైతం కూటమి పార్టీల నేతలే దక్కించుకుని, మద్యాన్ని ఏరులై పారిస్తూ.. జేబులు నింపుకుంటున్న తరుణంలో బార్లను సైతం చేజిక్కించుకోవాలనే పక్కా వ్యూహంతోనే కూటమి నేతలు టెండర్లు వేయకుండా బ్లాక్ మెయిలింగ్‌కు దిగినట్లు టాక్ నడుస్తోంది.

మద్యం సిండికేట్ల బ్లాక్ మెయిల్

కూటమి పార్టీలకు చెందిన మద్యం సిండికేట్లు డిపాజిట్లు, బార్ లైసెన్సు ఫీజులను భారీగా తగ్గించేలా ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టు 18న ఏలూరు జిల్లాలో 18 ఓపెన్, 2 కల్లుగీత కులాలకు బార్లు కేటాయిస్తూ... టెండర్లు వేసేందుకు ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 26తో దరఖాస్తులు వేసేందుకు ఆఖరు తేదీగా నిర్ణయించగా.. జిల్లాలో కనీసం 4 బార్లకు కూడా టెండర్లు దాఖలు కాలేదు. చేసేది ఏం లేక ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పెంచింది. 28 వరకూ గడువు పెంచినా ఫలితం లేకుండా పోయింది. మొత్తానికి 30న టెండర్లు పరిశీలించి.. 10 బార్లకు మాత్రమే లాటరీ విధానంలో టెండర్లు ఖరారు చేశారు. మరో 10 బార్లకు టెండర్లు వేయకుండా మద్యం సిండికేట్ అడ్డుకుందనే ఆరోపణలు ఉన్నాయి.

పొలిటికల్ రింగ్

కూటమి పార్టీలకు చెందిన నేతలు, మద్యం వ్యాపారులు ప్రైవేటు మద్యం దుకాణాల ఎంపికల్లోనూ బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్‌లతో మద్యం షాపులను చేజిక్కించుకున్నారు. అదే తరహాలో నూతన బార్ పాలసీలోనూ తమదైన శైలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవటం.. మరోవైపు టెండర్లు వేయకుండా అడ్డుకోవటం, బార్ల నిర్వహణ కష్టంగా మారిందంటూ చెబుతూ.. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తూ తక్కువ ధరలకే బార్లను దక్కించుకునే పన్నాగం పన్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏలూరులో జనాభా ప్రాతిపదికన ఏడాదికి బార్ లైసెన్సు ఫీజు రూ.55 లక్షలుగా నిర్ణయించారు. ఒక టెండరు వేసేందుకు నాన్ రిఫండబుల్ డిపాజిట్ రూ.5 లక్షలుగా చెప్పటంతో తక్కువ సొమ్ముకే బార్లను సొంతం చేసుకోవాలనే యత్నాలు కూటమి పార్టీ సిండికేట్లు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది.

ఏలూరు నగరంలో 4 బార్లకే టెండర్లు ?

ఏలూరు జిల్లాలో 18 ఓపెన్ కేటగిరీ, మరో రెండు కల్లుగీత కులాలకు బార్లను కేటాయించారు. ఏలూరులో 11 ఓపెన్, 1 కల్లుగీత కులానికి బార్లను కేటాయించారు. జంగారెడ్డిగూడెం నగర పంచాయతీలో 2 ఓపెన్, 1 కల్లుగీత కులానికి, నూజివీడు మున్సిపాల్టీలో 4 బార్లు, చింతలపూడి నగర పంచాయతీలో ఒక ఓపెన్ కేటగిరీ బార్‌ను కేటాయించారు. ఏలూరు నగరంలో పాతవి 10 బార్లు ఉండగా, తాజా బార్ పాలసీలో మరో రెండు పెంచారు. ఏలూరులో ఓపెన్ కేటగిరీలో 3 బార్లకు, కల్లుగీత కులానికి కేటాయించిన మరొక బార్‌కు ...మొత్తానికి 4 బార్లకు మాత్రమే టెండర్లు వేశారు. గరిష్టంగా కల్లుగీత కులానికి కేటాయించిన బార్‌కు మాత్రమే 5 టెండర్లు వేయగా, మిగిలిన వాటిలో మూడింటికీ ఒక్కో దానికి 4 చొప్పున మాత్రమే టెండర్లు వేశారు. జంగారెడ్డిగూడెంలో గరిష్టంగా కల్లుగీత కులానికి కేటాయించిన బార్‌కు 13 టెండర్లు వేశారు. నూజివీడులో 2 బార్లకు టెండర్లు వేయగా మరో బార్‌కు దరఖాస్తులేమీ దాఖలు కాలేదు, జంగారెడ్డిగూడెంలో ఒక బార్‌కు టెండర్లు పడలేదు, చింతలపూడిలోని ఒక్క బార్‌కు టెండర్లు వేయగా లాటరీలో ఎంపిక చేశారు.

న్యూస్‌రీల్

చెత్త తొలగించారు




చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి స్పందన

ఆగిరిపల్లి: స్థానిక కొలిమి బజార్‌లో పేరుకుపోయిన చెత్తను పంచాయతీ సిబ్బంది శనివారం తొలగించారు. శుక్రవారం సాక్షిలో 'చెత్తను తొలగించండి' కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఆధ్వర్యంలో కొలిమి బజార్‌లోని హై స్కూల్, రైస్ మిల్లు వద్ద ఉన్న చెత్తను తొలగించారు.

తమ్మిలేరుకు కొనసాగుతున్న వరద



నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు జలాశయం నుంచి నీరు లీక్ అవుతున్న దృశ్యం

చింతలపూడి: ఖమ్మం జిల్లా, బేతుపల్లి నుంచి తమ్మిలేరు రిజర్వాయర్‌కు శనివారం స్వల్పంగా వరద కొనసాగింది. దీంతో అధికారులు ప్రాజెక్టు వద్దే మకాం వేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 348.7 అడుగులకు చేరుకుంది. గోనెలవాగు స్టోరేజ్ ట్యాంక్ నీటిమట్టం 348 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ కె.లాజర్‌బాబు తెలిపారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి అలుగుపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 800 క్యూసెక్కుల నీరు ఆంధ్రా కాల్వ ద్వార ప్రాజెక్టులోకి వస్తోంది. దీంతో ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

లెక్చరర్లను నియమించాలని వినతి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌ఓ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని రామకోటి సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్ విద్యార్థులకు జువాలజీ లెక్చరర్‌ను, పెదవేగిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో కామర్స్ లెక్చరర్‌ను నియమించాలని కోరుతూ పీడీఎస్ఓ నాయకులు ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించిన హై స్కూల్ ప్లస్‌లలో లెక్చరర్ లేక, తరగతులు జరగక ఇబ్బంది పడుతున్నారని, ఈ కారణంగా విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఏలూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌లో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులను ప్రవేశపెట్టి, అందుకు అవసరమైన తరగతి గదులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ అదృశ్యం

జంగారెడ్డిగూడెం : పోలీస్ శాఖలో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ బుడిపుల సుబ్బారావు అదృశ్యమయ్యారు. శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో సుబ్బారావు కామవరపుకోట జంక్షన్ నుంచి చింతలపూడి రోడ్డుకు మోటార్ సైకిల్‌పై వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. అనంతరం ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. తడికలపూడి, టి.నరసాపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుబ్బారావు ఎస్‌బీలో పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం సుబ్బారావు సెల్‌ఫోన్ సిగ్నల్స్ జంగారెడ్డిగూడెం తాడువాయి సెల్ టవర్ పరిధిలో గుర్తించి, డ్రోన్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా సుబ్బారావు ఆచూకీ తెలియలేదు. సుబ్బారావు మిస్సింగ్‌పై ఆయన భార్య పద్మమాలిని ఫిర్యాదు చేయగా, తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీనిపై జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర మాట్లాడుతూ సుబ్బారావు అదృశ్యంపై గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు.

మంచినీళ్లు కూడా ఇవ్వలేదు

కనకాయలంక వరద బాధితుల ఆవేదన

యలమంచిలి: కనకాయలంక గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టి నాలుగు రోజులవుతుంది. ఇంత వరకు ఒక్క నాయకుడు కూడా వచ్చి ఎలా ఉన్నారు అని అడిగిన పాపాన పోలేదు. కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదు. చంటి బిడ్డలు పాల కోసం అలమటిస్తున్నారు. ఇళ్ల చుట్టూ దోమలు ముసురుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కనకాయలంక గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టడంతో శనివారం వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి పార్టీ పరామర్శించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వరద వచ్చిన వెంటనే మంచి నీళ్లు, పాలు, పిల్లలకు బిస్కట్లు, బ్రెడ్, పశువులకు దాణా ఇచ్చే వారని మహిళలు చెప్పారు. దీనిపై గోపి స్పందిస్తూ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలన్నారు. వరద నీరు చుట్టుముట్టి నాలుగు రోజులైనా కనీసం మంచినీళ్లు సరఫరా చేసే సామర్థ్యం ప్రభుత్వానికి లేదా అని దుయ్యబట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వరద వచ్చిన వెంటనే బాధితులను ఆదుకుంటే అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న నిమ్మల రామానాయుడు గోదావరిలో దిగి ఆకలి కేకలు అంటూ కంచాలు, గరిట డప్పు కొట్టారని, మరి ఇప్పుడు ప్రజల ఆకలి కేకలు మంత్రికి వినపడడం లేదా అని ఎద్దేవా చేశారు. పడవలు నడిపే సరంగులకు కూడా భోజనం పెట్టలేని దీన స్థితిలో ఈ మంచి ప్రభుత్వం ఉందని గోపి విమర్శించారు. దాణా లేక అలమటిస్తున్న పశువులకు దాణా ఇవ్వకపోతే సోమవారం ఉదయం వైఎస్సార్‌సీపీ తరఫున రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు, వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు నాయకులు వినుకొండ రవి, వలవల ప్రసాద్, పులి సుబ్రహ్మణ్యం, పులి కాశి విశ్వేశ్వర కేశవమూర్తి, గుడాల సురేష్, నెల్లి ఆనందరావు, చింద్రపు గణపతి ఉన్నారు.



వరద బాధితులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి

ఉద్యాన వర్సిటీ పరిశోధనలకు అవార్డు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని 21 పరిశోధనా స్థానాల ద్వారా రైతులకు అందిస్తున్న విస్తృత సేవలకు ఉద్యాన వర్సిటీకి సుపరిపాలనకు ఇచ్చే అవార్డు వచ్చినట్లు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తెలిపారు. ఉద్యాన వర్సిటీ తొలిసారిగా ఏడు పరిశోధనా ప్రాజెక్టులతో పోటీపడింది. కొవ్వూరు పరిశోధనా స్థానం నుంచి సంప్రదాయ అరటి రకాలలో నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, అంబాజీపేట నుంచి కొబ్బరిలో త్వరగా కాపునకు వచ్చే హైబ్రిడ్ మొక్కల తయారీ, జీవ నియంత్రణ పద్ధతులతో కీటక యాజమాన్యం, చీనీ నిమ్మ పరిశోధనా స్థానం నుంచి రాయలసీమ ముఖ్య ఉద్యాన పంటలైన చీనీ, నిమ్మలో అధిక ఆదాయం ఇచ్చే రకం మొక్కలు మొదటి రెండు దశలలో నెగ్గి ఆర్డర్ ఆఫ్ మెరిట్ సర్టిఫికెట్ అవార్డును దక్కించుకున్నాయి. ఆఖరి పోటీల్లో అంబాజీపేట నుంచి కీటక యాజమాన్యంలో మిత్ర పురుగుల ఉత్పత్తి ప్రాజెక్టు స్కోచ్ అవార్డు 2025 అవార్డు గెలుచుకుందని చెప్పారు.

రిజర్వేషన్ ఫలాలు దక్కడం లేదు



సంచారజాతుల సమావేశంలో మోషేనురాజు, ప్రసాదరాజు, వీరన్న తదితరులు

భీమవరం: స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా సంచార జాతులకు రిజర్వేషన్ ఫలాలు ఒక్క శాతం కూడా అందడం లేదని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. భీమవరంలో శనివారం భారతదేశ విముక్తి సంచారజాతుల 73వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్ర వీరన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మోషేను రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు మాట్లాడుతూ దేశంలో సంచార జాతులను గుర్తించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని, జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా సంచార జాతులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాజకీయ గుర్తింపుతో పాటుగా అనేక సంక్షేమ పథకాల ద్వారా అభివృద్ధి పథంలో తీసుకెళ్లారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికీ 14 నెలలు గడిచినా సంచార జాతులను గుర్తించకపోవడం దారుణమన్నారు. పెండ్ర వీరన్న మాట్లాడుతూ బ్రిటిష్ వ్యవస్థలో సంచార జాతులకు జరిగిన అన్యాయం నేటికీ కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ స్ఫూర్తి పేరుతో సంచారజాతులను మోసం చేస్తుందన్నారు. రానున్న కాలంలో అన్ని జిల్లాల్లో సంచార జాతులను సంఘటితం చేసి ఉద్యమానికి శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నరసాపురం వైఎస్సార్‌సీపీ పార్లమెంటు ఇన్‌చార్జ్ గూడూరు ఉమాబాల, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చినిమిల్లి వెంకటరాయుడు తదితరులు పాల్గొన్నారు.

లాటరీలో బార్ల కేటాయింపు

ఏలూరు(మెట్రో): 2025–28 కాలానికి జనరల్, గీత కులాలకు బార్లకు శనివారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి లాటరీ తీశారు. ఓపెన్ కేటగిరీలో 18 బార్లు, రిజర్వ్ కేటగిరీలో రెండు బార్లకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా, పది బార్లకు మాత్రమే 4 మించి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. సంబంధిత బార్లకు కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించి పేర్లను ప్రకటించారు. లాటరీ ద్వారా ప్రభుత్వానికి రు. 4.30 కోట్లు ఆదాయం సమకూరినట్లు కలెక్టర్ తెలిపారు.



బార్లకు లాటరీ తీస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన అవసరం

ఏలూరు(మెట్రో): సత్వర న్యాయం కోసం చట్టాలపై అవగాహనతో పాటు పేదరిక నిర్మూలన కోసం అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసు క్యాంపు ఆన్ నల్సా స్కీంలపై నిర్వహించిన అవగాహన సదస్సును ఆమె ప్రారంభించారు. కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనె సీతారామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాలకు రూ 225.17 కోట్లు, స్త్రీనిధి ద్వారా రూ 66.32 కోట్లు, ఉన్నతి స్కీములో రూ 2.28 కోట్లు, దివ్యాంగ విద్యార్థులకు 3 టచ్ ఫోన్లు పంపిణీ చేశారు. ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఇటీవల లోక్ అదాలత్‌లో 373 సివిల్ కేసులు, 292 ఎంబీటీపి కేసులు, 10,896 క్రిమినల్ కేసులు పరిష్కరించామన్నారు. జిల్లావ్యాప్తంగా 496 న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించామని తెలిపారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల ద్వారా పేదరిక నిర్మూలనకు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు.



చెక్‌లు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి

సర్పంచ్ భర్తపై దాడికి యత్నం

- ఎమ్మెల్యే చింతమనేని దౌర్జన్యం
- అక్రమ అరెస్ట్.. పోలీసుల అదుపులో శ్రీను

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కక్షపూరిత రాజకీయాలకు నెలవుగా దెందులూరు నియోజకవర్గం మారింది. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేస్తున్న ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. పెదవేగి మండలం పినకడిమి సర్పంచ్ పలగాని సునీత భర్త శ్రీనుపై దౌర్జన్యం చేసి దాడికి యత్నించడంతోపాటు పోలీసులను ఉపయోగించి, అక్రమ అరెస్ట్ చేయించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం శ్రీను తన పొలంలో పనిచేస్తుండగా అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే చింతమనేని వెంటనే పిచికారీ ఆపాలంటూ దౌర్జన్యం చేశారు. శ్రీను నా పొలంలో పిచికారీ చేస్తే మీకేం సంబంధమని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే చింతమనేని స్ప్రేయర్‌ను లాక్కుని రావాలంటూ గన్‌మెన్‌ను శ్రీను పొలంలోకి పంపించారు. గన్‌మెన్ దౌర్జన్యంగా శ్రీను నుంచి స్ప్రేయర్‌ను లాక్కున్నాడు. అక్కడితో ఆగకుండా శ్రీనుని పోలీసులతో అరెస్ట్ చేయించి పెదవేగి ఎస్సై కె.రామకృష్ణతో పెదపాడు పోలీస్‌స్టేషన్‌కి తరలిస్తున్నట్టు సమాచారం.

అక్రమ అరెస్టును ఖండించిన అబ్బయ్యచౌదరి

శ్రీను అక్రమ అరెస్టును దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తీవ్రంగా ఖండించారు. పోలీస్ ఉన్నతాధికారులతో, శ్రీను కుటుంబ సభ్యులతో మాట్లాడారు. న్యాయవాదులను తీసుకుని వెంటనే శ్రీను వద్దకు వెళ్లాలని వైఎస్సార్‌సీపీ నాయకులను ఆదేశించారు.

సీపీఎస్ ఉద్యోగుల పోరాటానికి మద్దతు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెప్టెంబర్ 1న విజయవాడలో తలపెట్టిన పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమానికి ఏపీటీఎఫ్ 1938 సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ సంఘ అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.రామ్మోహన్, జీ.మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

రియల్ దందా

- అడ్డగోలుగా అనుమతుల్లేని భారీ వెంచర్లు
- కొత్తూరు జూట్‌మిల్లు సమీపంలో భారీ లేఅవుట్
- ఇడా అనుమతి లేకుండానే అట్టహాసంగా వెంచర్ ఏర్పాటు
- రూ.13 కోట్ల విలువైన 2.21 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంచర్‌లో కలుపుకున్న వైనం
- కమిషనర్ మొదలుకొని కలెక్టర్ వరకూ ఫిర్యాదు చేసిన స్థానికులు
- అధికారులు స్పందించకపోవడంతో హైకోర్టులో కేసు దాఖలు



ఏలూరు శివారు కొత్తూరు జూట్ మిల్లు వద్ద వెంచర్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అనుమతులు ఉండవు.. సంబంధిత శాఖాధికారులు పరిశీలించి అంతా సక్రమమేనని నిర్ధారణ చేయరు. చట్టంలోని లొసుగులు అడ్డంపెట్టుకుని వెంచర్లు ఏర్పాటు చేయడం, ముందస్తు జాగ్రత్తగా దరఖాస్తు చేసుకోవడం.. అనుమతి వచ్చేలోపు వెంచర్‌లో విక్రయాలు పూర్తి చేయడం ఇది ఏలూరులో కొన్ని రియల్ ఎస్టేట్ వెంచర్లల్లో జరుగుతున్న దందా. తాజాగా ఒక వెంచర్ నిర్వాహకుడు 2.21 ఎకరాల ప్రభుత్వ భూమిని కలుపుకుని అట్టహాసంగా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రారంభించాడు. దీనిపై స్థానికులు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఇలా అందరికీ ఫిర్యాదు చేశారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో హైకోర్టులో కేసు దాఖలు చేశారు. ఏలూరు సమీపంలోని కొత్తూరు జూట్‌మిల్లు వద్ద నగరానికి చెందిన ఒక రియల్టర్ సుమారు 9.67 ఎకరాల విస్తీర్ణంలో ఫేజ్–3 పేరుతో భారీ లేఅవుట్ ఏర్పాటు చేశారు. గత నెలలో ప్రజాప్రతినిధితో వెంచర్‌ను ఓపెన్ చేసి బ్రోచర్‌ను రిలీజ్ చేయించారు. కట్‌చేస్తే... నగరపాలక సంస్థ నుంచి, డీటీసీపీ, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి ఎలాంటి అనుమతి మంజూరు కాలేదు. ఇడాకు కేవలం దరఖాస్తు మాత్రమే సమర్పించారు. దీనిలో సర్వే నెంబర్ 327లో 1.02 ఎకరాలు, సర్వే నెంబర్ 328లో 1.16 ఎకరాల భూమి ప్రభుత్వ పోరంబోకుగా, ఖాళీ బాటగా ప్రభుత్వ అడంగల్‌లో నమోదైంది. సదరు వెంచర్ నిర్వాహకుడు ఆ భూమిని కూడా కలుపుకుని వెంచర్‌ను నిర్మించి దాన్ని రహదారిగా కొంత మార్చి మిగిలింది వెంచర్‌లో కలిపేశారు. దీనిపై ఈ ఏడాది ఏప్రిల్ నుంచి స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దాదాపు రూ.13 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని స్వాహా చేయడమే కాకుండా అనుమతి లేని వెంచర్ ఏర్పాటు చేసి భారీ విక్రయాలకు తెరతీశారు. దీనిపై ఏప్రిల్ 11న ఒక సారి, మే 23న మరోసారి స్థానికులు ఫిర్యాదు చేశారు. జాయింట్ కలెక్టర్ మొదలుకొని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు ఫిర్యాదు కాపీని పంపారు.

చర్యలు తీసుకోవాలని ఆదేశించినా స్పందన శూన్యం

ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాలతో జాయింట్ కలెక్టర్ విచారించి నివేదిక సమర్పించి చర్యలు తీసుకోవాలని మే 8న నగర కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఇడాలో ప్రభుత్వ భూమి కలిసి ఉండటంతో అనుమతి రాదు. గజం రూ.13 వేలు పెట్టి విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం పొలిటికల్ టర్న్ తీసుకుంది. నగరానికి చెందిన కీలక నేత బడా సెటిల్‌మెంట్ నిర్వహించి విచారణకు అడ్డుపడటంతో వ్యవహారం పెండింగ్‌లో ఉంది. బడా నేతకు దాదాపు కోటిన్నరకుపైగా చెల్లించడంతో వ్యవహారం ముందుకు సాగకుండా చట్టంలోని లొసుగులు వినియోగిస్తున్నారని ఆరోపణలున్నాయి. మరోవైపు దాసరి వందన జీవన్ శ్యామ్ అనే వ్యక్తి దీనిపై ఫిర్యాదులు చేసి విసిగిపోయి హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేశారు.

ఫిర్యాదులు పట్టించుకోవడం లేదు



ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని అధికారుల చుట్టూ తిరిగి ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. రూ. 13 కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని అధికారులే వెంచర్ యజమాని వద్ద ముడుపులు తీసుకుని ధారాదత్తం చేశారు. దీనిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్, నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో హైకోర్టులో కేసు దాఖలు చేశాం.

– దాసరి వందన జీవన్‌శ్యామ్

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


భక్తులతో నిండిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయ ప్రాంగణం, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, కల్యాణ కట్ట తదితర విభాగాలు భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

భీమవరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు జరుగుతున్నట్టు ఎవరి దృష్టికి వచ్చినా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి లక్ష్మీనారాయణ అన్నారు. బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న మాసివ్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ ముగింపు సందర్భంగా శనివారం భీమవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు సమాజానికి పట్టిన ఒక రుగ్మత అని, దానిని సమూలంగా నాశనం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. బాల్య వివాహాలే గాకుండా బాల్యంలో గర్భధారణ వల్ల తల్లికి, బిడ్డకు అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి సురేష్ బాబు, ఒకటవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి హనీష, 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్ జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, ప్యానల్ న్యాయవాదులు, జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్త డాక్టర్ పి సూర్యనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు.. ప్రయాణం తుస్సు

ప్రయాణం గోవిందా!

- ద్వారకాతిరుమలలో బస్సులు లేక భక్తుల అవస్థలు
- భీమవరం, నరసాపురం డిపోల సర్వీసుల రద్దు
- మద్ది క్షేత్రానికి ఆటోలే దిక్కు


చింతలపూడి, జంగారెడ్డిగూడెం బస్సుల కోసం ప్లాట్‌ఫామ్ వద్ద మహిళల పడిగాపులు


భీమవరం బస్సు ఎక్కేందుకు తోపులాట

ద్వారకాతిరుమల : స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నామని గొప్పలు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, పలు బస్సు సర్వీసులను రద్దు చేసి ప్రయాణికులను ఇక్కట్లకు గురిచేస్తోంది. మహిళల ఉచిత ప్రయాణం వల్ల కలిగే నష్టాన్ని తగ్గించుకునేందుకే ఇలా చేస్తున్నారంటూ ప్రయాణికులు ధ్వజమెత్తుతున్నారు. ముఖ్యంగా ప్రముఖ క్షేత్రాల నుంచి పలు ప్రాంతాలకు బస్సు సర్వీసులు సరిగ్గా లేక భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో శనివారం సరిగ్గా బస్సు సర్వీసులు లేక భక్తులు అష్టకష్టాలు పడ్డారు. వివరాల్లోకి వెళితే. చిన్నతిరుపతిగా పేరొందిన ద్వారకాతిరుమల క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. అధిక శాతం మంది ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తారు. దాంతో శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా పలు ఆర్టీసీ డిపోలు ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా నడుపుతున్నాయి. అయితే ఇటీవల భీమవరం, నరసాపురం డిపోలు పలు సర్వీసులను రద్దు చేయడంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రద్దయిన బస్సు సర్వీసులు

గతంలో భీమవరం డిపో బస్సు మధ్యాహ్నం 12.30 గంటలకు ద్వారకాతిరుమలకు వచ్చి, చింతలపూడి వెళ్లేది. అదే బస్సు తిరిగి సాయంత్రం 4 గంటలకు ద్వారకాతిరుమలకు వచ్చి, భీమవరం వెళ్లేది. అలాగే నరసాపురం డిపో బస్సు సాయంత్రం 5 గంటలకు ద్వారకాతిరుమలకు వచ్చి, సత్తుపల్లి వెళ్లేది. అదే బస్సు మరుసటిరోజు ఉదయం 7 గంటలకు ద్వారకాతిరుమలకు వచ్చి, నరసాపురం వెళ్లేది. అయితే నరసాపురం టు సత్తుపల్లి బస్సు సర్వీసు స్త్రీ శక్తి పథకం అమలు చేయడానికి రెండు రోజుల ముందే రద్దు చేశారు. కాగా భీమవరం టు చింతలపూడి బస్సు సర్వీసు స్త్రీ శక్తి పథకం అమలైన వారం రోజుల తరువాత రద్దు చేశారు.

మద్ది క్షేత్రానికి వెళ్లాలంటే ఆటోలే దిక్కు

శ్రీవారి దర్శనానంతరం అధిక శాతం మంది భక్తులు గుర్వాయిగూడెంలోని మద్ది క్షేత్రానికి వెళుతుంటారు. అయితే ప్రస్తుతం బస్సు సర్వీసులు సరిగ్గా లేకపోవడంతో చాలా మంది భక్తులు మద్దికి వెళ్లకుండానే ఇంటికి వెనుతిరుగుతున్నారు. కొందరు భక్తులు ఆటోకి అధిక మొత్తంలో చెల్లించి కామవరపుకోట వరకు వెళ్లి, అక్కడి నుంచి బస్సుల ద్వారా గుర్వాయిగూడెంకు చేరుకుంటున్నారు.

ప్లాట్‌ఫామ్‌ల వద్ద పడిగాపులు

కామవరపుకోట, చింతలపూడి, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం ప్లాట్‌ఫామ్‌ల వద్ద గంటల తరబడి పడిగాపులు పడుతున్నారు. భీమవరం, నరసాపురం ఆర్టీసీ డిపోలు సర్వీసులను రద్దు చేయడంతో కామవరపుకోట వైపునకు ఉదయం 9.30 గంటలకు ఒక బస్సు, మళ్లీ మధ్యాహ్నం 1.45 గంటలకు ఒక బస్సు మాత్రమే వెళుతున్నాయి. 1.45 గంటల బస్సు కూడా తెలంగాణ రాష్ట్రం భద్రాచలం డిపోకు చెందినది కావడంతో అందులో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం లేదు. తిరిగి మధ్యాహ్నం 2.45 కి ఒక బస్సు, మళ్లీ సాయంత్రం 6.30 గంటలకు (నరసాపురం టు కమలాపురం) ఒక బస్సు మాత్రమే వెళుతున్నాయి. అలాగే ద్వారకాతిరుమల నుంచి భీమవరంనకు వెళ్లే బస్సులు ఉదయం 7 గంటలకు, ఆ తర్వాత మధ్యాహ్నం 1 గంటకు మాత్రమే ఉన్నాయి. ఆ ఒకటి రెండు బస్సుల్లో ఎక్కేందుకు ప్రయాణికులు పోటీ పడుతున్నారు. దాంతో బస్సులు కిక్కిరుస్తున్నాయి. కనీసం జంగారెడ్డిగూడెం డిపో అయినా సర్వీసులను పెంచితే కొంచెం కష్టాలు తప్పుతాయని ప్రయాణికులు, భక్తులు వాపోతున్నారు.

విద్యార్థులు, ఉద్యోగులకు తప్పని తిప్పలు

నరసాపురం నుంచి ద్వారకాతిరుమల మీదుగా సత్తుపల్లికి వెళ్లే బస్సు గతంలో సాయంత్రం 5 గంటలకు స్థానిక బస్టాండ్‌కు చేరుకునేది. ఆ సమయం విద్యార్థులు, ఉద్యోగులు, యాత్రికులకు అనువుగా ఉండేది. అయితే దాన్ని రద్దు చేయడంతో ప్రస్తుతం వారంతా 6.30 గంటల వరకు బస్టాండులోనే వేచి ఉండాల్సి వస్తోంది. దాంతో తాడిచర్ల, కామవరపుకోట, ప్రగడవరం, చింతలపూడి, పరిసర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. తాము ప్రతిరోజూ ఇళ్లకు చేరుకునే సరికి రాత్రి అవుతుందని, ఒక్కోసారి వ్యయ ప్రయాసలు పడి ఆటోల్లో వెళుతున్నామని అంటున్నారు.

ఏంటీ తిప్పలు



ఆర్టీసీ బస్సులో ద్వారకాతిరుమలకు వచ్చి శ్రీవారికి మొక్కులు చెల్లించాను. దర్శనానంతరం తిరిగి ఇంటికి వెళదామని బస్టాండుకు వచ్చాను. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 వరకు బస్సు లేదని చెబుతున్నారు. అప్పటి వరకు బస్టాండ్‌లో ఎలా ఉండాలి. మాకేమిటీ తిప్పలు.

– చిన్ని వెంకటేశ్వరరావు, టి.నరసాపురం

మద్ది క్షేత్రానికి ఎలా వెళ్లాలి



కుటుంబ సభ్యులమంతా కలసి శ్రీవారిని దర్శించుకున్నాం. మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రానికి వెళ్లాలని బస్టాండుకు వచ్చాం. ఒక్క బస్సు కూడా లేదు. ఆటోలు కామవరపుకోట వరకు వెళుతున్నాయి. మనిషికి రూ.30 అడుగుతున్నారు. అక్కడి నుంచి మళ్లీ బస్సుల్లో మద్ది క్షేత్రానికి వెళ్లాలి. ఇన్ని కష్టాలా.

– గురజాల దుర్గ, అన్నపవారిగూడెం, ముసునూరు మండలం

బస్సులు తీసేయడం దారుణం



మహిళలకు బస్సు ప్రయాణం ఫ్రీ అని చెప్పి బస్సులు తీసేస్తే ఎలా. దీని వల్ల సామాన్య భక్తులు, ప్రయాణికులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. భీమవరం వెళ్లేందుకు బస్సు లేక గంటల తరబడి బస్టాండులో పడిగాపులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు దీనిపై స్పందించాలి.

– కత్తుల ఏడుకొండలు, శేరేపాలెం, మొగల్తూరు మండలం

మొక్కు తీర్చుకునేందుకు వెళుతూ..

- మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టిన ట్రావెల్ బస్సు
- భర్త దుర్మరణం, భార్యకు తీవ్ర గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భీమడోలు: శ్రీవారికి మొక్కు తీర్చుకునేందుకు వెళుతున్న ఓ భక్తదంపతులను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో భర్త దుర్మరణం చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారి భీమడోలు కనకదుర్గమ్మ ఆలయం వద్ద చోటు చేసుకుంది. వివరాల ప్రకారం .. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం పాందువా గ్రామానికి చెందిన కంచరవు నాగేశ్వరరావు (62), సూర్యకాంతం ద్వారకాతిరుమలలో మొక్కు తీర్చుకునేందుకు ఉదయం మోటార్‌సైకిల్‌పై బయలుదేరారు. మార్గమధ్యమైన భీమడోలు కనకదుర్గాదేవి ఆలయం వద్ద డివైడర్‌ను దాటుతుండగా, ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న ట్రావెల్ బస్సు వేగంగా వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి నాగేశ్వరరావు, సూర్యకాంతం రోడ్డుపై పడిపోగా నాగేశ్వరరావు తలకు బలమైన గాయమై దుర్మరణం చెందాడు. సూర్యకాంతంకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. తమ వెంటబెట్టుకుని వెళ్తున్న పూజా సామాగ్రి రోడ్డుపై చెల్లాచెదురుగా పడింది. ఈ విషాద ఘటన చూపరులను కలిచి వేసింది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న వెంటనే సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఏలూరు సర్వజనాసుపత్రికి తరలించారు. నాగేశ్వరరావు కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు డివైడర్ వద్ద స్టాపర్లు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ పోలీసులను కోరారు.


నాగేశ్వరరావు మృతదేహం

బోసిపోయిన ఉల్లి మార్కెట్

కనిపించని ఉల్లి లారీలు


ఖాళీగా ఉన్న బ్రహ్మానందరెడ్డి మార్కెట్

తాడేపల్లిగూడెం: ఉల్లి లారీలతో కళకళలాడే తాడేపల్లిగూడెం మార్కెట్ బోసిపోయింది. బుధవారం నుంచి ఆదివారం వరకు బ్రహ్మానందరెడ్డి మార్కెట్ కర్నూలు ఉల్లితో కళకళలాడుతుంది. అయితే లారీలు రాకపోవడంతో ప్రస్తుతం మార్కెట్‌లో ఏ వీధి చూసినా బోసిగా కనిపిస్తోంది. హమాలీల సందడి లేదు. భీమవరం బైపాస్ రోడ్డుతో పాటు మిగిలిన ప్రాంతం కూడా ఉల్లి లారీల జాడ లేదు.

కర్నూలు ఉల్లికి కేరాఫ్ మార్కెట్

జూలై వచ్చిందంటే కర్నూలు ఉల్లికి కేరాఫ్ మార్కెట్‌గా ఉన్న తాడేపల్లిగూడెంలో ఏ రోడ్డు చూసినా ఉల్లి లారీల సందడే. 24 గంటలు మార్కెట్‌లో దిగుమతి, ఎగుమతులు చేసే వాతావరణం ఉంటుంది. ఉల్లిలారీల ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పట్టణ శివారు వ్యవసాయ మార్కెట్ యార్డులో, విమానాశ్రయభూములు దాటిన ప్రాంతంలో, ప్రత్తిపాడు, జువ్వలపాలెం ప్రాంతాల్లో ఉన్న వ్యాపారుల గోదాములకు పంపించేవారు. దర్శిపర్రు పుంత, సవిత్యపేట గోదాముల వద్ద లారీలను ఆపి, మార్కెట్‌లో రద్దీ తగ్గాక ఉల్లిని దిగుమతి చేసుకొనేవారు.

ఏజెంట్ల సందడి లేదు

కర్నూలు సీజన్ ప్రారంభం అయ్యే సరికి బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా రాష్ట్రాలకు గ్రేడింగ్ చేసిన కర్నూలు ఉల్లిపాయలను, ఈ రకంలో గ్రేడింగ్‌లో వచ్చే తెల్ల రకం ఉల్లిపాయలను వేరుచేసే హమాలీలు, ఆడ కూలీలు హడావుడి ఉండేది. ప్లాస్టిక్ గోతాల నుంచి గోనె సంచుల్లోకి మార్చిన గ్రేడింగ్ రకం ఉల్లిపాయలను ఎగుమతి చేసుకొనేందుకు వివిధ రాష్ట్రాల ఉల్లిపాయల కొనుగోలు ఏజెంట్లు సందడి ఇక్కడ మార్కెట్‌లో ఉండేది.

వచ్చేది ఆరు, ఏడు లారీలే..

ఆగస్టులో రోజుకు 50 లారీల నుంచి ఆ పైన కర్నూలు ఉల్లి లారీలు వచ్చేవి. అలాంటిది అక్కడి నుంచి ఇక్కడికి కేవలం ఆరు నుంచి ఏడు లారీల సరుకు మాత్రమే వస్తోంది. అది కూడా కొనేవారు లేరు. ఉభయగోదావరి జిల్లాల్లో కర్నూలు రకం ఉల్లిని వినియోగించరు. ఇక్కడ మహారాష్ట్ర నుంచి వచ్చే ఉల్లిని మాత్రమే వినియోగిస్తారు. కర్నూలు రకం ఉల్లి ఉత్తరాంధ్ర ప్రాంతం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో వాడతారు. అల్పపీడనం, తుపానుల కారణంగా అక్కడకు ఉల్లి రవాణాను ఆపేశారు. దీంతో వచ్చిన ఆరేడు లారీల సరుకు కూడా వ్యాపారుల వద్ద కుళ్లిపోయే స్థితి నెలకొంది. పైగా రైతులకు వచ్చిన ఉల్లి నిమిత్తం అందింది క్వింటాలుకు రూ.300 నుంచి రూ.500 మాత్రమే. ఈ సీజన్‌లో ఉల్లి రైతులకు ఆశించిన ధరలు వచ్చే అవకాశం లేదని ఇక్కడి వ్యాపారులు అంటున్నారు.

నేరస్తులకు కఠిన శిక్షలు విధించేలా పనిచేయాలి

అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు



ఏలూరు టౌన్: నేరస్తులకు కఠిన శిక్షలు విధించేలా కోర్టు మానిటరింగ్ సెల్ అత్యంత సమర్థవంతంగా పనిచేయాలని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలపై జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ పోలీస్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ పరిధిలోని కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది హాజరయ్యారు. కేసుల విచారణ, కోర్టులో పెండింగ్ కేసులు, చార్జిషీట్ దాఖలు వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ నేరస్తులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా పనిచేయాలని, నేరస్తులు శిక్ష నుంచి తప్పించుకోకూడదన్నారు. ఆయా కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ముఖ్యంగా మహిళలపై దాడులు, హత్యాచారాలు, పోక్సో కేసులు, బాలికలపై అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు వంటి కేసుల్లో కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేయటం, సాక్షులను కోర్టుకు సకాలంలో హాజరయ్యేలా చేయటం బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. ప్రతిరోజూ కోర్టుల్లో జరిగిన ప్రక్రియను డాక్యుమెంట్‌గా తయారు చేసి స్టేషన్ అధికారికి నివేదించాలన్నారు. సమీక్షా సమావేశంలో కోర్టు మాని టరింగ్ సెల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ, హెడ్ కానిస్టేబుల్ కేఎస్ఎన్ మూర్తికి ప్రోత్సాహక బహుమతిని జిల్లా అదనపు ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి, మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

టి.నరసాపురం: పోక్సో కేసులో ముద్దాయికి ఏలూరు జిల్లా స్పీడ్ ట్రైల్ స్పెషల్ జడ్జి 20 ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు టి.నరసాపురం ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని సాయంపాలెంకు చెందిన పిల్లి వెంకటేశ్వరరావు అలియాస్ నందా, 2018 డిసెంబర్ 22వ తేదీన 4 ఏళ్ల మైనర్ బాలికను తన ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఏడుస్తూ బయటకు వచ్చిన బాలికను తల్లి ఇంటికి తీసుకువెళ్లి పరిశీలించగా బాలిక రహస్య భాగాలపై గాయాలను గుర్తించింది. వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అప్పటి జంగారెడ్డిగూడెం డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ దర్యాప్తు చేసి నందాను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఏలూరు జిల్లా స్పెషల్ జడ్జి స్పీడ్ ట్రైల్ ఆఫ్ అఫెన్స్ అండర్ పోక్సో యాక్ట్ కోర్టు న్యాయమూర్తి కె.వాణిశ్రీ ముద్దాయి నందాకి 20 ఏళ్ల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని, అలాగే బాధితులకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. కాగా, కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.అమర శ్రీనివాస్ వాదించారు. ముద్దాయికి శిక్ష పడటంలో ప్రతిభ చూపిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

మహిళలను ప్రభుత్వం ఆదుకోవాలి


ఐద్వా జిల్లా మహాసభల్లో నినదిస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రోజురోజుకీ పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా ఆదాయాలు లేక మహిళలు మైక్రో ఫైనాన్సుల నుంచి అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని, ఈ దుస్థితిని మహిళలు అధిగమించేలా ప్రభుత్వమే ఆదుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీ.రమాదేవి, సహాయ కార్యదర్శి శ్రీదేవి డిమాండ్ చేశారు. ఐద్వా రెండవ జిల్లా మహాసభలు శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్నింట్లో రాణిస్తున్నా రెండవ తరగతి మహిళగానే పరిగణించబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి ఏ.శ్యామల రాణి మూడేళ్ల కార్యక్రమాలు, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. సమస్యల పరిష్కారానికి నిలబడే మహిళా సంఘానికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పీ.రామకృష్ణ మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర రంగాలలో పనిచేస్తున్న మహిళలను కూడా మహిళా సంఘంగా కలుపుకోవాలన్నారు. జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రతినిధులు వారి మండలాల్లో సమస్యలపై మాట్లాడారు. తొలుత జిల్లా సీనియర్ నాయకురాలు ఎం.వరలక్ష్మి జెండావిష్కరణ చేశారు. అనంతరం మహాసభకు పీ.హైమావతి, ఎన్.పద్మాంజలి, ఎన్. నిర్మల అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముందుగా జిల్లా సీనియర్ నాయకురాలు జీ. విమలకు సమావేశం సంతాపం తెలియజేస్తూ నివాళులర్పించింది.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: అదనపు కట్నం వేధింపులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. వివరాల ప్రకారం మండలంలోని పెయ్యేరుకు చెందిన పెందుర్తి మౌనికకు హైదరాబాద్‌కు చెందిన అనీల్‌కుమార్‌తో 2024లో వివాహం జరిగింది. ఆ సమయంలో రూ.15లక్షలు కట్నకానుకలుగా ఇచ్చారు. వివాహం అనంతరం భర్తతోపాటు అత్తమామలు లక్ష్మీ, మల్లిఖార్జునరావు, కుటుంబసభ్యుడు సునీల్‌కుమార్ మౌనికను అధిక కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు బాధితురాలు మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రైవర్ శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు(మెట్రో)/భీమవరం: హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్ శిక్షణ పొందేందుకు ఆసక్తి ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మేరుగు ముక్కంటి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి నుంచి ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులకు శిక్షణ అందించే నిమిత్తం ఈనెల 21 నుంచి 27 వరకు దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందన్నారు. మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అందకపోవడంతో మరొక అవకాశం కల్పించే నిమిత్తం మహిళలు, పురుషులకు సెప్టెంబర్ 5 వరకు దరఖాస్తు గడువును పెంచినట్లు చెప్పారు. దరఖాస్తులకు ఏలూరు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ పనివేళలో సంప్రదించాలన్నారు.

వేధింపులు ఎదురైతే చెప్పాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎలాంటి వేధింపులు ఎదురైనా చిన్నారులు, విద్యార్థులు పెద్దలకు ధైర్యంగా తెలియజేసి సహాయం పొందాలని కలెక్టర్ కే. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కిశోరి వికాసం 2.ఓ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శనివారపుపేట జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోక్సో యాక్ట్, గుడ్, బ్యాడ్ టచ్‌లపై వివరించారు.